

న్యూస్ బాక్స్

మట్టి తరలింపునకు మార్గదర్శకాలు రూపొందించాలి


పెద్దపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాణిజ్య అవసరాలకు మట్టి తరలింపునకు పకడ్బందీ మార్గదర్శకాలను రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధి కారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మట్టి తరలింపు విధి విధానాలపై సంబంధిత అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నీటి వనరుల నుంచి మట్టి తరలింపునకు పకడ్బందీ విధానం తయారు చేయాలని సూచించారు. వాణిజ్య అవసరాలు గమనిస్తూనే పర్యావరణాన్ని సంరక్షించే విధంగా పాలసీ ఉండాలని, పోలీస్, రెవెన్యూ, నీటి పారుదల, మైనింగ్ అధికారులు, సమన్వయంతో అందరికీ ఉపయోగపడే విధంగా పాలసీ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. డీసీపీ కరుణాకర్, ఆర్డీవో గంగయ్య, ఉప సంచాలకులు మైనింగ్ శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ రమేష్, పర్యవేక్షకులు ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన డీఎల్‌పీవో

మంథనిరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను డీఎల్‌పీవో సతీష్‌కుమార్ గురువా రం పరిశీలించారు. గ్రామంలో జరగుతున్న మంచినీటి సరఫరా లికేజీ పనులు, నర్సరీ పనులు పర్యవేక్షించి సూచనలు కార్యదర్శికి తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి భాను ప్రసాద్ ఉన్నారు.

రేషన్ కార్డుల జారీ

మరింత ఆలస్యం



- దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక యాప్
- క్షేత్ర స్థాయిలో సర్వే చేయనున్న ప్రభుత్వ సిబ్బంది
- జిల్లాలో 40 వేలకు పైగా దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కొత్త రేషన్ కార్డుల జారీ మరింత ఆలస్యం కానున్నది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది సర్వే చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. జిల్లాలో 40 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని పరిశీలించనున్నారు. ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల ద్వారా 32,174 దరఖాస్తులు రాగా, మీ సేవా కేంద్రాల ద్వారా 8 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ చేశారు. ఈ వివరాల న్నింటినీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రత్యేక యాప్‌నకు అనుసంధానం చేశారు. ఈ యాప్‌లో దరఖాస్తుదారుడి పేరు ఎంటర్ చేయగానే వారి వివరాలు అన్ని యాప్‌లో కనబడతాయి.

గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది. పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి పరిశీలించనున్నారు. వారి ఆదాయ స్థితిగతులు, గతంలో రేషన్ కార్డు ఉందా, తల్లిదండ్రుల పేరిట గల రేషన్ కార్డులో పేర్లు ఉన్నాయా లేదా తదితర అంశా లపై సర్వే చేయనున్నారు. వారు చెప్పిన అంశాలను యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసే వరకు మరో నెల రోజులు పట్టవచ్చని తెలుస్తున్నది. కొత్త కార్డుల జారీ కోసం జనవరిలో నిర్వహించిన గ్రామ, పట్టణ సభలకు ముందు పరిశీలన చేసినప్పటికీ, ఆ తర్వాత దరఖాస్తులు వెల్లువలా రావడంతో మరో సారి పరి శీలనకు ప్రత్యేక యాప్ రూపొందించారు. కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారా అని దరఖాస్తు దారులు నిరీక్షించాల్సి వస్తున్నది.

జనవరి 26న కొందరికే కొత్త రేషన్ కార్డులు..

జనవరి 26వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టింది. అందులో కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు ప్రయోగాత్మకంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసిన ఆ గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి 1200 వరకు రేషన్ కార్డులను జారీ చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో మిగతా వారికి కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డుసభల్లో 16 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఆ దరఖాస్తుల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ తర్వాత నవంబర్‌లో నిర్వహించిన కులగణన సర్వే సందర్భంగా మొత్తానికే రేషన్ కార్డులు లేని కుటుంబాలు 15,255 ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది జనవరి 22, 23, 24 తేదీల్లో నిర్వహించిన గ్రామసభల్లో రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాలను చదివి వినిపించారు. అంతకు ముందు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. గ్రామసభల్లో తమ పేర్లు లేవని అనేక మంది ఆందోళనకు గురయ్యారు. దీంతో మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత మీసేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఇంతలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కార్డుల జారీ ప్రక్రియ నిలిచి పోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసి నెల రోజులు గడిచినా కూడా కార్డులు జారీ చేయలేదు. రేషన్ కార్డులు లేక అనేక మంది ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారు. అన్ని పథకాలకు రేషన్ కార్డుతో ముడిపెట్టారు. తాజాగా ఈ నెల నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో ఆ బియ్యం కూడా కోల్పోవాల్సి వస్తున్నది. కార్డుల జారీ కోసం ప్రభుత్వం మరోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసేందుకు ప్రత్యేక యాప్ తీసుకరావడంతో ఆలస్యం కానున్నదని అర్హులు ఆందోళనకు గురవుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్ కోసమే ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్ తీర్చిదిద్దడానికే ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ ఏర్పాటు చేస్తుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. గురువారం మిని గురు కుల పాఠశాలలో రూ.10 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను ప్రారంభిం చారు. అనంతరం డైనింగ్ హాల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అడ్లూరి మాట్లాడుతూ గురుకులాల్లో మౌలిక వసతుల రూపకల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని పాశిగామలో 200 ఎకరాలలో 145 కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పనులు మొదలు పెడుతామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించిన కలెక్టర్ కోయ శ్రీహర్షకు అడ్లూరి కృతజ్ఞతలు తెలిపారు. డీపీఓ వీరబుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులు కింద కూర్చొని భోజనం చేస్తుండడం, కిందనే పడుకోవడంతో కలెక్టర్ చొరవతో డైనింగ్ హాల్ నిర్మాణంతోపాటు రూ.2 లక్షలతో పరుపులను కొనిచ్చారని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ లంబాడి బాషలో ప్రసంగించి ఆకర్షించారు. డిప్యూటీ సెక్రెటరీ వేణుగోపాల్, తహసీల్దార్ ఎండీ వకీల్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, డీఈ రాజమౌళి, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఎంఈఓ పోతు ప్రభాకర్, ఎంపీఓ రమేష్, నాయకులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, లింగయ్య, అజయ్, తిరుపతి, స్వామి, దేవి జనార్దన్, కొత్త నర్సింహులు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజితోత్సవాలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి మార్కండేయకాలనీలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు అబద్దపు హామీ లు ఇచ్చి గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలను నాశనం చేశారని, భూముల అమ్మకాల పేరుతో మూగజీవాలను గోస పెడుతున్న రేవంత్‌రెడ్డికి ఉసురు తగులుతుంద న్నారు. రైతులందరికి రుణమాఫీ చేస్తానని చెప్పి సగం కూడా మాఫీ చేయలేదని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయ కులను నిలదీసినందుకు తనపై, కార్యకర్తలపై 12కేసులు పెట్టించారని, కేసులకు భయపడమని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా పోరాటం చేస్తామ న్నారు. నాయకులు కౌశిక హరి, పెంట రాజేష్, జేవీ రాజు, మురళీధర్‌రావు, భాస్కర్, రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, రాకం వేణు, జనగామ కవితసరోజిని, గోప ఐలయ్య, పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ ఎదుట ఆశావర్కర్ల నిరసన

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు పెంచాలని ఆశా వర్కర్లపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు ఒత్తిడి తీసుకురావడంతో ఆశాలు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుండా తమను వేధింపులకు గురి చేయడం సరైంది కాదని ఆందోళనకు దిగారు. గురువారం మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ హిమబిందు ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లు, మూడు పీహెచ్‌సీ సెంటర్ల నుంచి వంద మంది ఆశావర్కర్లు హాజరయ్యారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, ఆశావర్కర్ల నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతుందని ప్రిన్సిపాల్ అనడంతో ఆశావర్కర్లు ప్రిన్సిపాల్‌పై ఎదురు తిరిగారు. తాము రాత్రనక, పగలనక పని చేస్తుంటే తమపై నిందలు వేయడం సరైంది కాదని, తమకు లేబర్ రూమ్ వద్ద కూర్చోవడానికి కనీసం వసతులు కల్పించడం లేదని, గర్భిణీలను ప్రసవాల సమయంలో రాత్రి వేళల్లో తీసుకువచ్చి, ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి వారికి తోడుగా, ధైర్యంగా ఉంటున్నామని, అవేవి పట్టించుకోకుండా తాము పని చేయడం లేదంటూ మాట్లాడడం సరైంది కాదని నిరసన తెలిపారు. దీంతో సమావేశం మధ్యలోనే ప్రిన్సిపాల్ వెళ్లిపోయింది. అక్కడే ఉన్న గైనకాలజిస్టులు ఆశా వర్కర్లను శాంతింపచేశారు. తమకు మంచినీళ్లు కూడా దొరకని పరిస్థితి అని, గర్భిణీలు సుఖ ప్రసవం అయ్యే వరకు తాము దగ్గరుండి సేవలందిస్తున్నప్పటికీ తమను చులకన భావనతో చూడడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఊపందుకున్న వరి కోతలు..

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

- మబ్బులతో ఆందోళన చెందుతున్న రైతులు



ఎక్లాస్‌పూర్‌లో ధాన్యాన్ని అరబెట్టిన రైతులు

మంథనిరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 20 వేల ఎకరాల్లో రైతులు యాసంగి వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో హార్వేస్టర్ల ద్వారా పంటలను కోస్తున్నారు. ధాన్యాన్ని వరి కళ్లాలు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే స్థలాల వద్దకు తరలించి ఎండబెట్టారు. ఏప్రిల్ రెండో వారం వచ్చినా ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. ఇప్పటికే పలు చోట్ల వడగండ్ల వానలు పడుతుండటంతో మిగతా 8వ పేజీలో

పేద ప్రజల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం



పెద్దకల్వలలో సన్నబియ్యం లబ్దిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పేదప్రజల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం మండలంలోని పెద్దకల్వలలో సన్నబియ్యం లబ్ధిదారుడు చిట్టవేన లక్ష్మి ఇంట్లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ వేణుతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్నబియ్యం బువ్వ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యం పథకం ద్వారా పేదల కళ్లల్లో ఆనందం కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గతంలో దొడ్డు బియ్యంతో దళారులు, రైస్ మిల్లర్లు లాభం పొందారని గుర్తు చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద ప్రజల ఆకలి గోస తీర్చేందుకు సన్న బియ్యం పంపిణీ అనేది గొప్ప వరమన్నారు. దేశ చరిత్రలోనే కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న నిర్ణయం పలు రాష్ట్రాలకు దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు. ఆర్డీవో గంగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య, ఎంపిడివో శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీసర్పంచ్ కారెంగుల రమేశ్, మాజి ఉపసర్పంచ్ అర్కుటి సంతోష్, జిల్లా రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు పెగడ రమేష్, నాయకులు ఓడ్నాల రమేష్, ఉప్పు సతీష్ పటేల్, ఉప్పుసాగర్‌పటేల్ పాల్గొన్నారు.

90 శాతం బియ్యం పంపిణీ పూర్తి

జిల్లాలో 90 శాతం వరకు సన్నబియ్యం పంపిణీ పూర్తయిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈనెల 4న సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తే నాలుగు రోజుల్లో 90 శాతం పైగా పూర్తయిందని, సన్నబియ్యం పంపిణీకి మంచి స్పందన ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు

- నవ జాత శిశు కేంద్రం ప్రారంభం



నవ జాత శిశు కేంద్రాన్ని ప్రాంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. గురువారం ఐఓసిఎల్ సౌజన్యంతో రూ.40 లక్షలతో మాతా శిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నవ జాత శిశు కేంద్రం, రూ.55 లక్షలతో ఏర్పాటు చేసిన 40 పడకల ప్రత్యేక వార్డు, రూ.12 లక్షలతో కొనుగోలు చేసిన మెకానైజడ్ లాండ్రీలను కలెక్టర్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐఓసిఎల్ సంస్థ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద పలు పరికరాలతో నవ జాత శిశు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా వైద్యులు చర్యలు తీసుకుంటున్నారని, రిస్క్ కేసులను, ప్రీ మెచ్యూర్డ్ ప్రసవాలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ సూచించారు. మెరుగైన సేవల కారణంగా అవుట్ పేషెంట్ సంఖ్య 700కు పెరిగిందని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని రకాల ఇన్ పేషెంట్ సేవలు మెరుగ్గా అమలు చేయాలని సూచించారు. గర్భిణీల కోసం టిఫ్ఫా స్కానింగ్ అందుబాటులో ఉందని, డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, డయాలసిస్ కేంద్రం ద్వారా రోజుకు 15 మంది లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో 2డి ఎకో సేవలు కూడా అందుబాటులో వున్నాయని, ప్రైవేటు ఆసుపత్రులలో డబ్బు వృధా చేసుకోవద్దని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు లభిస్తున్నాయని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు. నవ జాత శిశువులకు కూడా అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ ఛైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, పిల్లల వైద్య నిపుణులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజలపై భారం వేయద్దని సీపీఎం మండల కార్యదర్శి కళ్లెపెల్లి అశోక్ పేర్కొన్నారు. అంబెడ్కర్ విగ్రహం ఎదుట కట్టెలపోయి పై చాయ్ చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ. 50లు పెంచడం దారుణమన్నారు. పేద ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలన్నారు. పెంచిన సిలిండర్ ధర తగ్గించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు ఎ,జ్యోతి, సిపెల్లి రవీందర్, నాయకులు జిల్లాల ప్రశాంత్, మొదుంపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్,శ్రీనివాస్ రెడ్డి, శివాజి,సందీప్, సూరజ్ పాల్గొన్నారు.

బీజేపీ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. గురువారం బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గావ్ చలో... బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని కూరగాయల మార్కెట్‌తో పాటు జనగామ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి పరిసర ప్రాంతాల్లో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకంలో భాగంగా అనేక కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్నారని, చిరు వ్యాపారులు దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్థంబమని, వారిని బలంగా నిలబెట్టేందుకే బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు తెలంగాణలో కాషాయం జెండా ఎగురుతుందన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, కోడూరి రమేష్, భూమయ్య, కోమళ్ల మహేష్, పిడుగు కృష్ణ, జక్కుల నరహరి, కుమారస్వామి, రవీందర్‌రెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

నేడు సహపంక్తి భోజనాలు

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గ్రామగ్రామాన సభలు సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో సహ పంక్తి భోజనాలు చేసే కార్యక్రమం చేపట్టామని బీజేపీ జిల్లా అధ్య క్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. సుభాష్‌నగర్‌లో సహపంక్తి భోజన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ లబ్ధిదారుల ఇండ్లలో సహపంక్తి భోజనాలు చేస్తున్నామన్నారు. నాయకులు కడారి అశోక్ రావు, సౌదరి మహేందర్ యాదవ్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, కూకట్ల నాగరాజు, కోట నాగేశ్వర్, ఎల్లంకి రాజు, ఎనగందుల ఎల్లయ్య మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సీహెచ్ పూజ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీలకు జిల్లాకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారిణి సీహెచ్ పూజ ఎంపికైంది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెలలో జరగనున్న ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీల్లో పూజ తెలంగాణ రాష్ట్ర జట్టునుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ నెలలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో విశేష ప్రతిభచాటి ఏడోస్థానం సాధించి సీనియర్‌మహిళల విభాగంలో జిల్లా నుంచి మొట్టమొదటిసారిగా ఇండియన్ అథ్లెటిక్స్‌పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పూజను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కథల పోటీల్లో ఆవునూరు విద్యార్థిని ప్రతిభ



శృతిక

గంభీరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథలపోటీల్లో ముస్తాబాద్ మండలం ఆవునూరు ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఎలుసాని శృతిక రాసిన కథ ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. ఈ కథల పోటీల్లో ఉభయ రాష్ట్రాల నుంచి 541 కథలు రాగా, అందులో 35 మంది రాసిన కథలను ఎంపిక చేశారు. జూన్ మాసంలో హైదరాబాద్ రవీంద్రభారతీలో శృతికకు సన్మానంతో పాటు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు బాలసాహిత్యానికి చెందిన పుస్తకాలు అందజేస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్ తెలిపారు.

మూడు కాళ్ల కోడి




మూడు కాళ్లతో ఉన్న కోడి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలోని ఓ పౌల్ట్రీ ఫాంలో మూడు కాళ్ల కోడిని నిర్వాహకుడు గురువారం గుర్తించాడు. గ్రామంలోని రాజిరెడ్డికి చెందిన పౌల్ట్రీ షెడ్‌ను లక్ష్మణ్ అనే వ్యక్తి లీజుకు తీసుకొని బాయిలర్ కోళ్లను పెంచుతున్నాడు. కోళ్లకు మేత వేస్తున్న క్రమంలో మూడుకాళ్ల కోడి లక్ష్మణ్‌కు కనిపించింది. ఈవిషయం గ్రామస్తులకు తెలియడంతో కోడి ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

పిడుగుపాటుతో దున్నపోతు మృతి

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో బుధవారం రాత్రి అకాల వర్షంతోపాటు పిడుగుపడగా గ్రామానికి చెందిన రైతున్యాలపట్ల రాజయ్యకు చెందిన దున్నపోతు మృతిచెందింది. సుమారు 30వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వేడుకున్నాడు.



ఉపాధికి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా

- పదో తరగతి విద్యార్థులకు అవకాశం
- తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య
- పాలిసెట్-25 పిలుస్తోంది

చొప్పదండి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక కాలంలో ఉత్పత్తి రంగానికి, సాంకేతిక విద్య అభ్యసించే వారికి డిమాండ్ అధికంగా ఉంది. అందులో పదో తరగతి పూర్తి కాగానే వెంటనే ఉత్పత్తి ఆధారిత రంగాల్లో చదువుకోవాలనే విద్యార్థులకు పాలిటెక్నిక్ ఒక అద్భుతమైన మార్గం. పాలిటెక్నిక్ కోర్సు చదివిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయి. విద్యార్థులకు 'పాలిసెట్' ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పదో తరగతి తర్వాత ఇంజనీరింగ్ టెక్నికల్ కోర్సుల్లో చేరి సత్వర ఉపాధి పొందవచ్చు. అలాంటి విద్యార్థులకు చక్కటి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా. డిప్లొమా కోర్సు పూర్తయ్యాక వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చు.


- పాలిటెక్నిక్‌లో చేరి చదువుకుంటే విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుంది. చిన్న వయసులోనే ప్రత్యేకంగా తమకిష్టమైన రంగంలో నైపుణ్యం సాధించొచ్చు. పాలిటెక్నిక్‌లో విద్యార్థులు తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకొని మంచి భవిష్యత్తును రూపొందించుకోవచ్చు. పది పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు ఒక సువర్ణ అవకాశం.

● కోర్సుల వివరాలు

పాలిటెక్నిక్‌లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ఉంటుంది. పదవ తరగతి నుంచి ప్రశ్నలు ఉంటాయి. డీఈఈఈ, డీఎంఈ, డీసీఎంఈ, సివిల్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ వంటి 24 కోర్సులు ఉంటాయి. కళాశాలలోని ఒక్కో కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉంటాయి. డిప్లొమా అనంతరం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి పలు కంపెనీలు ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగాలు కుడా ఈ డిప్లమా కోర్సు ద్వారా సాధించవచ్చు. ఈ-సెట్ ప్రవేశ పరీక్ష రాసి బీటెక్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అందరి లాగానే బీటెక్ చేసి గ్రాడ్యుయేట్ కావచ్చు. కొన్నికళాశాలల్లో హాస్టల్ సదుపాయాలు కూడా ఉన్నాయి.

● వ్యవసాయ అనుబంధ కోర్సులు

ఇంజనీరింగ్. అగ్రి. వెటర్నరీ హార్టికల్చర్ డిప్లమా కోర్సులలో ప్రవేశం పొందవచ్చు. వ్యవసాయ విద్య విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్ల అగ్రికల్చర్ డిప్లమా, ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లమా, మూడేళ్ల వ్యవధిలో పూర్తయ్యే డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులో పాలిసెట్ ద్వారా ప్రవేశం పొందవచ్చు. వెటర్నరీ విశ్వ విద్యాలయం పరిధిలో రెండేళ్ల యానిమల్ హస్బెండ్రీ పాలిటెక్నిక్ కోర్సు, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్ల డిప్లమా ఇన్ హార్టికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీకి పాలిసెట్-25 నోటిఫికేషన్ విడుదల అయ్యింది.



పాలిసెట్ వివరాలు

- ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- 100 రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు, దరఖాస్తు చేసుకోవచ్చు.
- మే13న ప్రవేశ పరీక్ష
- పరీక్ష సమయం 2-30 గంటలు
- 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

గణితం నుంచి 60 మార్కులు, భౌతిక శాస్త్రం-30, రసాయన శాస్త్రం-30, జీవశాస్త్రం-30 మార్కుల చొప్పున పదవ తరగతి సిలబస్ ప్రశ్నలు ఉంటాయి.

- పూర్తి వివరాలకు https://polycet.sbtet.telangana.gov.in సైట్‌లో చూసుకోవచ్చు.

ఫీజు వివరాలు: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 250 రూపాయలు.
బీసీ, జనరల్ విద్యార్థులకు 500 రూపాయలు.

అర్హతలు : పదో తరగతి పాస్ అవ్వాలి. 2025లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 డిసెంబర్ 31 నాటికి విద్యార్థుల వయస్సు 15 నుంచి 22 ఏళ్ల మధ్యలో ఉండాలి.

చికిత్సపొందుతూ గర్భిణి మృతి

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రక్తస్రావంతో బాధపడుతూ కరీంనగర్ మాతాశిశుకేంద్రంలో చికిత్సపొందుతూ జంగంపల్లి సంధ్య అనే గర్భిణి గురువారం ఉదయం మృతిచెందింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా తాండూర్ గ్రామానికి చెందిన సంధ్య బుధవారం అనారోగ్యానికి గురైంది. మంచిర్యాలలోని ఒకప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, మెరుగైనచికిత్స కోసం కరీంనగర్‌లోని మాతాశిశు కేంద్రానికి వచ్చింది. ఇక్కడచికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలు సంధ్య భర్త జంగంపల్లి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదుతి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామానికి చెందిన కొల్లూరి రాయమల్లు (73) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య అనారోగ్య కారణాలతో గతంలో మృతిచెందడంతో రాయమల్లు ఒంటరిగా ఉంటున్నాడు. పెద్దపల్లిలో నివాసం ఉంటున్న రాయమల్లు కుమారుడు పలుమార్లు అతడివద్దకు రావాలని కోరినా వెళ్లలేదు. భార్య చనిపోయిన విషయాన్ని మనస్సులో పెట్టుకుని మనోవేదనతో బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగగా గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మహ్మద్ అజీజ్(31) అనే యువకుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజ్ కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడన్నారు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి తన భార్యను డబ్బులు అడిగితే ఇవ్వకపోవటంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అనంతరం అనుమానం వచ్చి గదిలో చూసేసరికి ఉరివేసుకుని ఉన్నాడు. తాగిన మైకంలో అజీజ్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి

రామడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెదిర శివారులోని కరీంనగర్-జగిత్యాల ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ మున్సిపల్‌కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ రాజశేఖర్ మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామడుగు మండలంలోని వెదిర పరిధిలోని రాజాజీనగర్‌కు చెందిన కుమ్మరి రాజశేఖర్(27) కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తూ అనూహ్యంగా బ్రిడ్జి వద్ద చెట్టుకు ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడ ప్రధాన రహదారి కొలతల సేకరణ



వేములవాడలో ప్రధాన రహదారిలోని భవనాల కొలతలు వేస్తున్న అధికారులు

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి ఇరువైపులా దుకాణాలు, భవనాల కొలతలను అధికారులు సేకరిస్తున్నారు. మెయిన్ రోడ్డు విస్తరణలో ఇండ్లు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు కోల్పోనున్న నిర్వాసితుల తుది జాబితా సిద్ధం చేసే క్రమంలో వివిధ శాఖలకు చెందిన 24 మంది అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి గురువారం కొలతలు సేకరించారు.

ఎదురెదురుగా ఢీకొన్న ఆటో, ఆర్టీసీ బస్సు

● ఆటోలో మందుగుండు సామగ్రిని గుర్తించిన పోలీసులు

గంగాధర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌వద్ద జాతీయ ప్రధానరహదారిపై ఆటో, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాలప్రకారం టీజీ 02 టిటి1770 నంబరుగల ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. జగిత్యాల నుంచి కరీంనగర్‌వైపు రెండు నెంబర్లు గల ఆటో(ఏపి36 టిబి5246,ఏపి36డబ్ల్యు6231) గంగాధర మండలం మధురానగర్ జాతీయ ప్రధానరహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలోని బాక్సులను తీసి బయటపడేసి డ్రైవర్ పరారయ్యాడు. విషయాన్ని బస్సుడ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ప్రమాదస్థలంలోని బాక్సులను పరిశీలించారు. బాక్సుల్లో పేలుడు పదార్థాలు(400జిలిటెన్ స్టిక్స్), వాటికి ఉపయోగించే వైరు బెండల్ లభించింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగకపోవడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సుడ్రైవర్ మెరుగుశ్రీనివాస్ పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అక్రమంగా, అనుమతిలేకుండా పేలుడు పదార్థాలను తరలిస్తు గుర్తుతెలియని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆటోలో లభించిన జిలిటెన్ స్టిక్స్

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఓ లాడ్జీలో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఎనిమిదిని పట్టుకొని, వారివద్ద నుంచి రూ.16,710 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్‌స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామశివారులో పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10,180 నగదుతో పాటు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

హనుమాన్ ఆలయంలో దొంగతనం

మానకొండూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయం గ్రామశివారులో ఉండడంతో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులకొట్టి హుండీలోని నగదు రూ.15వేలు, 10తులాల వెండిని ఎత్తుకెళ్లారు. గురువారం ఎప్పటిలాగే పూజారి ఆలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి ఆలయకమిటీకి తెలియజేశారు. కమిటీతో పాటు గ్రామస్థులు ఆలయానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్‌లో తనిఖీలు చేయగా ఎండీ.యాసిర్ అనే వ్యక్తి వద్ద 145 గ్రాముల గంజాయిని సీసీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. గంజాయిని జగిత్యాల రూరల్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ వినోద్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

రేపు పునఃప్రారంభం కానున్న

కాజీపేట్-దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు

పెద్దపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ కుంభమేళా సందర్భంగా రద్దయిన కాజీపేట్-దాదర్ వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 12వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. నంబర్ 07197/98గల కాజీపేట- దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం నుంచి నడవ నున్నది. ఈ రైలు జూన్ 28వ తేదీవరకు ఎగువ, దిగువ ఇరువైపులా 24 ట్రిప్పులు నడవనున్నది. ప్రతీశనివారం కాజీపేటలో ఉదయం 11:30గంటలకు బయలుదేరి పెద్దపల్లిజంక్షన్‌కు 12:36గంటలకు చేరుకోనున్నది. మరుసటిరోజు మధ్యాహ్నం1:26 గంటలకు దాదర్ చేరుకొంటుంది. తిరుగు ప్రయాణంలో ఆదివారం మధ్యాహ్నం3:25 గంటలకు దాదర్‌రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరి మరుసటిరోజు సోమవారం రాత్రి7:38 గంటలకు పెద్దపల్లిజంక్షన్‌కు, రాత్రి9:30 గంటలకు కాజీపేట చేరుకోనున్నది. ఈ రైలు కరీంనగర్ జిల్లా జమ్మికుంట స్టేషన్‌లో కూడా ఆగనున్నది. కాజీపేటనుంచి జమ్మికుంట, పెద్దపల్లి, బల్లార్షా, ఆదిలాబాద్, నాందేడ్ మీదుగా ప్రయాణిస్తుంది. నంబర్07195/96గల కాజీపేట- దాదర్, వయాపెద్దపల్లిజంక్షన్, నిజామాబాద్ మీదుగావెళ్లే రైలును ఇంకా పునరుద్ధరించలేదు. ఈరైలును పునరుద్ధరిస్తే 200 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు సమయం, డబ్బులు ఆదా కానున్నాయని ఆ రైలును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం పెద్దపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీపీ కార్యాలయంలో డీసీపీ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బండారికుంటకు చెందిన షేక్‌ఆసిఫ్ కొన్నేళ్లుగా ఇతరప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాడని వెల్లడించారు. ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్న ఆసిఫ్ జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నట్లు డీసీపీ పేర్కొన్నారు. నిందితుడికి గతంలోనూ నేర చరిత్ర ఉందన్నారు. 2016 నుంచి 2024 మధ్య అతనిపై ఎనిమిది గంజాయి కేసులు నమోదయ్యాయని, పిడి యాక్ట్ కింద కూడా శిక్ష అనుభవించాడని డీసీపీ తెలిపారు. పోలీసుల నిఘా పెరగడంతో ఆసిఫ్ మొగ్దుంపూర్‌కు మకాం మార్చాడన్నారు. కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఆటో నడుపుతూ గంజాయి విక్రయిస్తున్నాడన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌చెందిన సల్మాన్ అనేవ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నాడని తెలిపారు.

పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గంజాయి కోసం ఎదురుచూ స్తున్న వారికి వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చి విక్రయిస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకున్నట్లు డీసీపీ కరుణాకర్ వివరించారు. రూ.50వేల గంజాయితోపాటు, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని పట్టుకొన్న సీఐ కె.ప్రవీణ్ కుమార్,ఎస్సై జె. లక్ష్మణ్ రావు,సిబ్బందిని డీసీపీ అభినందించారు.

అకాల వర్షంతో.. అన్నదాతకు నష్టం..

● నేలకొరిగిన మొక్కజొన్న, నేలరాలిన మామిడి ● కళ్లాల్లో తడిసిన ధాన్యం

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన అకాలవర్షం మాదాపూర్ గ్రామంలో బీభత్సం సృష్టించింది. అకాలవర్షంతోపాటు ఈదురుగాలులతో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. మామిడితోటల్లో మామిడి కొమ్మలు విరిగిపడడంతో పెద్దమొత్తంలో మామిడి నేలరాలి రైతులకు అపార నష్టం వాటిల్లింది. మాదాపూర్ గ్రామానికిచెందిన రైతులు మాదుగుల మహేష్, గొడుగు స్వామికి చెందిన మొత్తం నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఇదేగ్రామంలో మామిడితోటల్లో భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పంటనష్టాన్ని ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అనంతగిరిలో వడగళ్ల వాన..

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల్లో పడిన వడగళ్లవానతో భారీగా పంటలకు నష్టంవాటిల్లింది. అనంతగిరి, పెద్దలింగాపూర్, తిప్పపూర్ గ్రామాల సమీపంలోని పంట పొలాలపై బుధవారం అర్ధరాత్రి గంటపాటు రాళ్ల వాన పడింది. దీంతో కోతకు వచ్చిన దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలోని వరిచేన్లు భారీగా దెబ్బతిన్నాయి. తమకు వడగళ్ళు తీరని నష్టం కలిగించాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మూడు గ్రామాల్లో జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు.

వేములవాడ రూరల్: బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన మండలంలో బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కురిసిన గాలివానతో తీవ్రపంటనష్టం వాటిల్లింది. బొల్లారం గ్రామంలో వరిపంట నేలకొరిగి ధాన్యం రాలిపోయింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాగాయపల్లి గ్రామంలో గాలివానకు రోడ్డుపై విరిగిపడ్డ చెట్లను బ్లూకోల్ట్స్ పోలీసులు తొలగించారు. ప్రధానరహదారిపైచెట్లు విరిగి పడిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పోలీసు సిబ్బంది శ్రీనివాస్, మల్లేశం స్థానికులతో కలిసి తొలగించారు.

తడిసిన ధాన్యం..

కోనరావుపేట/గంభీరావుపేట: కోనరావుపేట, గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. మంగళపల్లెలో మొక్కజొన్న నేలకొరిగింది. ఒక్కసారి రాత్రి రావడం వల్ల రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడ్డారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

ఇల్లందకుంట: ఈదురుగాలులతో నేలకొరిగిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం కరీంనగర్ జిల్లాకమిటీ సభ్యుడు చెల్పూరి రాము అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాములపల్లిలో ఈదురు గాలులతో నేలకొరిగిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మట్లాడుతూ మండలంలో సుమారు 150ఎకరాల వరకు మొక్కజొన్న పంట నేలకొరిగిందన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ.50వేలు ఇప్పించాలన్నారు. లేకపోతే రైతులందరితో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



కోనరావుపేట మండలం మంగళపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న



గంభీరావుపేట మండలం గజసింగవరంలో వర్షానికి తగిసిన ధాన్యం



వేములవాడ నాగాయపల్లిలో విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు



అనంతగిరి గ్రామంలో పడిన వడగళ్లు



గన్నేరువరం: నేలవాలిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు మాదుగుల మహేష్

గల్ఫ్ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమం కోసం రూపొందించనున్న ఎన్నారై పాలసీ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియమితులయ్యారు. అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి బీఎం వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్‌గా మంద భీమ్‌రెడ్డి, గౌరవ సభ్యులుగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్‌ను నియమించారు. సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాసరావు, కొట్టాల సత్యనారాయణగౌడ్(దుబాయ్), గుగ్గిళ్ళ రవీందర్, నంగి దేవేందర్, పరికిపండ్ల స్వదేశ్‌ను ఈకమిటీలో సభ్యులుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పన నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ కమిటీలో జిల్లా నుంచి ప్రభుత్వ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు అవకాశం లభించడం విశేషం.

బాలికపై అత్యాచారయత్నం

ఎలిగేడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలో ఒకటవ తరగతి చదువుతున్న బాలికపై యువకుడు (25) అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి బాలిక ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులకు గ్రామంలో పని ఉండడంతో ఇంటి సమీ పంలో ఉన్న దగ్గరి బంధువు వద్ద బాలికను ఉండమని చెప్పి వెళ్ళారు. దీనిని అదునుగా తీసుకొన్న యువకుడు బాలికపై వికృత చేష్టలకు పాల్పడినట్లు తెలిసింది. ఇంటికి తిరిగివచ్చిన తల్లిదండ్రులకు బాలిక అక్కడ జరిగిన విషయాన్ని ఏడ్చుకుంటూ చెప్పింది. దీంతో తల్లిదండ్రులు జూలపల్లి పోలీసులకు సమాచారం అందించారు.

వస్తున్నాం..అంజన్నా..





విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న అంజన్న ఆలయం

- నేటి నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు
- కొండగట్టులో మూడు రోజుల పాటు వేడుకలు
- తరలిరానున్న లక్షలాది భక్తులు

మల్యాల ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కాలినడకన, వాహనాల ద్వారా అంజన్న సన్నిధికి చేరుకోనున్నారు. దీక్షాపరులు ఇక్కడ మాల విరమణ చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. కొండగట్టులో జరిగే ఉత్సవాల కోసం అంజన్న ఆలయ పరిసరాల్లో క్యూలైన్, బారి కేడ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నిత్యం వేలాదిగా తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 650మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరంతా షిఫ్ట్ పద్ధతిలో దిగువ కొండగట్టు, ఘాట్ రోడ్డు, కొండపైన, ఆలయం, దీక్షవిరమణ మండపం, ప్రసాదాల కౌంటర్, కోనేరు, పార్కింగ్ స్థలాలు, జేఎన్‌టీయూ, దొంగల మర్రి ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు.

నేటి ఆర్జిత సేవలు రద్దు

శుక్రవారం నుంచి సోమవారం వరకు వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ఏప్రిల్ 11నుంచి 13 వరకు జయంతి ఉత్సవాలు జరగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. మళ్లీ ఏప్రిల్ 14 నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా కొన సాగుతాయని అన్నారు.

ప్రత్యేక అధికారిగా శ్రీనివాసరావు

కొండగట్టు హనుమాన్ చిన్న జయంతి వేడుకల సందర్భంగా ఉత్సవాలు సజావుగా నిర్వహణకు గాను దేవాదాయ శాఖ ఉత్సవాల ప్రత్యేక అధికారిని నియమించింది. అడిషనల్ కమిషనర్ ఇ.శ్రీనివాస్‌రావును ప్రత్యేక అధికారిగా నియమించడంతో కొండపైన దేవస్థానం అధికారులతో ఆయన కలిసి ఏర్పాట్లు, సౌకర్యాలు పర్యవేక్షిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: శ్రీకాంత్‌రావు, ఈవో

జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి కోసం చలివేంద్రాలు, మొబైల్ చలివేంద్రాలు, పార్కింగ్, క్యూలైన్ తదితర ఏర్పాటు చేశాం. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఉత్సవమూర్తుల యాగశాల ప్రవేశం

మల్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిన్నహనుమాన్ జయంతి నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చి మాల విరమణ చేసే దీక్షపరుల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన మాల విరమణ మండపానికి స్వామి వారి ఉత్సవమూర్తుల తీసుకెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈవో శ్రీకాంత్‌రావు, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, రఘు, అర్చకులు, వేదపండితులు ఉత్సవ మూర్తుల దీక్షావిరమణ మండప ప్రవేశంలో పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్ సత్యప్రసాద్

మల్యాల, ఆంధ్రజ్యోతి: చిన్నజయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి కొండగట్టులో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్, డీఎస్పీ రఘు చందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

అంజన్న జయంతికి ఏర్పాట్లు..

- కొండపైన, ఘాట్‌రోడ్డుపైన, 28 చోట్ల చలివేంద్రాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా భక్తులకు నీటిని అందించనున్నారు.
- ఘాట్‌రోడ్డుపై వాహనాలకు అనుమతి లేకపోగా కొండపైన బొజ్జ పోతన్న, కొండగట్టు స్టేజీల వద్ద పోలీసుల ఔట్ పోస్టు ఏర్పాటు
- దీక్ష విరమణలకు ప్రస్తుతం ఉన్న అర్చకులకు తోడు మరో వంద మంది సిబ్బంది నియామకం
- కొండగట్టు స్టేజీ సమీపంలోని తుమ్మ చెరువు, కొండపైన బొజ్జ పోతన్న ఆలయం, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో బృందావనం రిసార్ట్, జేఎన్‌టీయూ సమీపంలో కొండ పైకి వెళ్లే మార్గంలో, దాని పక్కనే వాహనాల కోసం పార్కింగ్‌కు ఏర్పాట్లు
- పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 366 మంది సిబ్బందితో మూడు షిఫ్ట్‌లలో పారిశుధ్య నిర్వహణ
- నాలుగు లక్షల లడ్డూలు తయారీ
- బస్టాండ్ వద్ద ఏడు ప్రసాద, ఏడు టికెట్ కౌంటర్ల ఏర్పాటు
- ఆరు కేంద్రాల్లో మూడు షిఫ్ట్‌లలో కొండపైన, స్టేజీ వద్ద వైద్య సిబ్బంది విధులు
- మెట్ల మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు 24గంటల విద్యుత్ సౌకర్యం, జనరేటర్‌ల ఏర్పాటు
- అందుబాటులో ఫైర్ ఇంజన్, అంబులెన్స్ సౌకర్యం
- భక్తులకు సరిపడా జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ నుంచి ఆర్టీసీ బస్సుల సేవలు
- నాలుగు బ్లాక్‌లలో తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు





పాదయాత్రగా వస్తున్న దీక్షాపరులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్



ఉత్సవమూర్తుల దీక్ష విరమణ మండప ప్రవేశానికి తీసుకువస్తున్న అర్చకులు

మంత్రుల పర్యటనకు భారీ భద్రత చర్యలు

- 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది
- సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల శివారులో అపెరల్ పార్కులో టెక్స్ పోర్టుయూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముగ్గురుమంత్రులు వస్తున్న సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ మహేష్ బీ గీతే తెలిపారు. గురువారం జిల్లాపోలీస్ కార్యాలయంలో అధికారులతో భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టు యూనిట్ ప్రారంభోత్సవానికి మంత్రులు వస్తున్నా సందర్భంగా దాదాపు 300మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టభద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. యూనిట్ ప్రారంభోత్సవ ప్రాంగణంలో వీఐపీ గ్యాలరీ, సభ ప్రాంగణంలో వీవీఐపీ జనరల్ పార్కింగ్ ప్రదేశాల్లో బందోబస్తులో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సదన్‌కుమార్, మధుకర్, నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్ఐలు పాల్గొన్నారు.

84.1శాతం మొబైల్ ఫోన్లు రికవరీ

సిరిసిల్ల క్రైం: జిల్లాలో 84.1శాతం మొబైల్ ఫోన్‌ల రికవరీ చేశామని ఎస్పీ మహేశ్ బి గీతే తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటుచేసిన సందర్భంగా రూ.10లక్షల విలువైన 100ఫోన్‌లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1587 ఫోన్‌లను బాధితులకు అందజేశామన్నారు. ఫోన్‌ల రికవరీలో, బాధితులకు అప్పగించడంలో కృషిచేస్తున్న ఐటి కోర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ రాజా తిరుమలేష్‌ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళికృష్ణ, ఐటి కోర్ ఎస్ఐ కిరన్‌కుమార్, ఆర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ జైలుకు వెళ్లడం ఖాయం

- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావు అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపాదించిన అక్రమాస్తులపై విరారణ జరగుతుందని, వారంతా జైలుకు వెళ్లడం ఖాయమని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. గురువారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంకు సంబంధించిన వేలాది ఎకరాల భూమిని తమ బినామీల పేరుమీదకు మార్చడానికే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చిందని ఆరోపించారు. ప్రాజెక్టులు, విద్యుత్ పేరుతో ఏడు లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో వారు మూడు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో పదివేల ఎకరాల భూమిని వారి బినామిల పేర్లమీదకు వెళ్లాయని ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణ చేసిందిని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీసీలపై ప్రేమ ఉంటే 42 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని, అసెంబ్లీలో ఫూలే విగ్రహం పెట్టాలన్న విషయం కవితకు అప్పుడు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. సమావేశంలో సమావేశంలో గజ్జెల ఆనందరావు, సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మన్, అనిల్, ప్రభాకర్, శంకర్, కొంండ్ర స్వరూప, ఆవారు లత, గొర్రె రాజయ్య, మైసని మనోహర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శీలం లక్ష్మణ్ ఆదేశాలతో ఏఎస్ఐ అబ్దుల్ జలీల్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరం పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకోగా మరో వ్యక్తి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 24,900 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

అంతర్ జిల్లా దొంగ పట్టివేత

- రూ.25 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- అరెస్టు చూపించి వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



దొంగను అరెస్టు చూపిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొన్నినెలలుగా తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌చేసి బంగారుఆభరణాలు దోచుకుంటున్న అంతర్‌జిల్లా దొంగను జగిత్యాలపోలీసులు పట్టుకున్నారు. రూ.25 లక్షల విలువగల 28.6తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఎస్పీ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి దొంగను అరెస్టు చూపించి పూర్తివివరాలు వెల్లడించారు. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన బక్కశెట్టికొమురయ్య అలియాస్ రేగులఅజయ్‌కుమార్(53) ఉపాధి కోసం మంచిర్యాల జిల్లాకేంద్రంలోని తిలక్ నగర్‌లో ఉంటూ దొంగతనాలు చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. 10సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేసే సమయంలో దొంగతనం చేసిన కొమురయ్య చంచల్‌గూడలో జైలు జీవితం అనుభవించాడు. బయటకు వచ్చిన అనంతరం 25దొంగతనాలు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కొమురయ్య అనుమానాస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో అంతర్ జిల్లా దొంగగా పోలీసులు గుర్తించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మూడు నెలల వ్యవధిలో ఏడు చోట్ల కొమురయ్య దొంగతనాలు చేసి 28.6 తులాల విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలు రికవరీ చేసిన టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణు గోపాల్, ఎస్సైలు కిరణ్ కుమార్, గీతను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘ చందర్ తదితరులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

బైకును వెనుక నుంచి ఢీకొట్టిన కారు

- చికిత్స పొందుతూ ఒకరు మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్‌శివారులో ఫ్లైఓవర్ దగ్గర ద్విచక్రవాహనాన్ని కారు వెనుకనుంచి ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, ఒకరు చికిత్సపొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్‌మండలం గర్రెపల్లికి చెందిన కొడగాని కిషన్‌రావు, తనభార్య శోభ(50), కూతురు అశ్వినితోకలిసి ద్విచక్రవాహనంపై ఎల్లంపల్లి నుంచి మానకొండూర్ మండలం నిజాయితీగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం తాడికల్ శివారులోని ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే కారు(ఏపీ09సీడబ్ల్యూ 0882) వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్‌రావు, అతని భార్య శోభ తలకు, తొంటి ఎముకకు, కూతురు అశ్వినికి రెండు కాళ్లకు, కంటి వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శోభను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కిషన్‌రావు బావమరిది బూరాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

కేజ్ కల్చర్ యూనిట్ల పరిశీలన

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో చీర్లవంచ వద్ద ఫిషిన్ ఫార్మా ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌ను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌లలో 4.2 లక్షల విత్తనాలను నిల్వ చేశారు. ప్రస్తుతం మిడ్ మానేరులో నీటి మట్టం తగ్గిపోతుండడంతో ఎక్కువగా పంజరాలను ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. నీటి మట్టం 8 టీఎంసీలు మాత్రమే ఉన్నందున వేసవి కాలం పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హెచ్చు తగ్గులు సంభవించే అవకాశం ఉందని ఫిషిన్ ఫాం ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీరు ఎక్కువ కాలం అధిక లోతు ఉండి ఇతర జలచరాల భద్రతకు భంగం కలగకుండా ఉండే అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వారి వెంట జిల్లా ఫీషరీస్ అధికారి సౌజన్యలు ఉన్నారు.



సూచనలు చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం

- అభివృద్ధి నెపంతో మరోమారు కాంగ్రెస్ ముసుగులో జగిత్యాల ఎమ్మెల్యే అరాచకం
- మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



జగిత్యాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేశారని, ప్రస్తుతం అభివృద్ధి నెపంతో కాంగ్రెస్ ముసుగులో మరోమారు అరాచకం చేయడానికి యత్నిస్తున్నాడని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా తాతల..తండ్రుల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ మాదేనని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ దౌర్జన్యం తట్టుకోలేక హబ్సీపూర్ గ్రామానికి చెందిన యువకుడు సారంగపూర్ అడవుల్లో ఉరివేసుకొని మృతి చెందిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. జగిత్యాలకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ నాయకుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయించారని, బీఆర్ఎస్‌లో చేరనందుకు తుంగూరు సర్పంచ్‌ను పదవి నుంచి సస్పెండ్ చేయించారని ఆరోపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి కీలక పాత్ర పోషించిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. గతంలో జగిత్యాలలో ఇళ్లు లేని నిరుపేదలకు 4వేల వ్యక్తిగత ఇళ్లు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి వద్ద జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పొలాసలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నూకపల్లి వద్ద న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశానని జీవన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో రాయికల్, పొలాస, బీర్పూర్ సీపీడబ్ల్యూ స్కీమ్ కోసం రూ.15 కోట్లు మంజూరు చేయించానన్నారు.

ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, గుంటి జగదీశ్వర్, రాధాకిషన్ రావు, పుప్పాల అశోక్, జితేందర్, మహిపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి కోతలు..
ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

(5వ పేజీ తరువాయి)


ధాన్యం కుప్పల పై కప్పిన కవర్లు

మంథని ప్రాంతంలో ఈదురుగాలులు, మబ్బులు కమ్ముకుంటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత యాసంగిలో సింగిల్‌విండో ద్వారా 35, ఐకేపీ 3 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ప్రారంభించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో అకాల వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం
కొత్త శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్, మంథని



మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో ద్వారా కొనుగోలు చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల కోసం స్థలాలను చదును చేశాం. త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వేగంగా కొనుగోలు జరిగేలా చూస్తాం. ఈవిషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యాన్ని తడవ కుండా చర్యలు తీసుకోవాలి.

మండలంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి, ఏప్రిల్ 10: (ఆంధ్రజ్యోతి): రాజాపూర్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచనల మేరకు గురువారం రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోడ్డబాపన్న, మాజీ ఎంపీపీ ఆరెల్లిదేవక్క, కొంరయ్యగౌడ్ నేతృత్వంలో గ్రామశాఖ అధ్యక్షుడు పుల్లెల కొమురయ్య ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ జైబాపు-జైభీమ్-జై సంవిధాన్ విశిష్టతను వివరించారు.

రేపటి నుంచి రామగుండం నియోజకవర్గంలో...

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో ఈనెల 12వ తేదినుంచి జరిగే రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జై బాపు..జై భీమ్...జై సంవిధాన్ నినాదంతో ఈ యాత్ర ఉంటుందన్నారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర 50 డివిజన్లలో గడపగడపకు వెళ్ళి రాజ్యాంగ పరిరక్షణ గురించి వివరిస్తామన్నారు. ఈయాత్రను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్ ప్రారంభిస్తారన్నారు. నాయకులు మహంకాళిస్వామి, కొలిపాక సుజాత, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, పాతపెల్లి ఎల్లయ్య, ముస్తాఫా, గట్ల రమేష్, గుండేటి రాజేష్, కొప్పుల శంకర్, ధూళికట్ట సతీష్, యుగేందర్, పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షపరుల పాదయాత్ర

ఎలిగేడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో గురువారం హనుమాన్ దీక్షపరులు పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర సుల్తాన్‌పూర్ నుంచి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగనున్నట్లు భక్తులు తెలిపారు. రామనామ స్మరణతో భక్తులు భజన సంకీర్తనలు పాడుతూ నడుచుకుంటే తరలివెళ్లారు. అప్పల కొమురయ్య, అప్పల బాలాజీ, ముద్ర వేణు, సతీష్, అంజయ్య, చందు, లక్ష్మణ్, ఆకుల హరీష్‌గౌడ్, మోహన్‌రావు, గురుస్వాములు అంజయ్య, రాజేశం, మల్లేశం, పాదయాత్ర ప్రారంభించారు.

జనరల్ ఆసుపత్రికి వాటర్ ఫ్రిజ్ అందజేత


ఆసుపత్రి నిర్వాహకులకు వాటర్ ఫ్రిజ్ అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగుల దాహార్తిని తీర్చడానికి బండి రామయ్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చంద్రమౌళి గురువారం రూ.46వేల విలువ చేసే 40 లీటర్ల వాటర్ ఫ్రిడ్జ్‌ను బహూకరించారు. ఆయన మాట్లాడుతూ యేటా రామయ్య చారిటబుల్ ట్రస్ట్ పేరుపై సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమౌళి, ఆర్ఎంఓ రేణుక, పీఆర్ఓలు అన్వర్, కృష్ణ, టెక్నీషియన్ ప్రకాష్ పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపర్చాలి

రామగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీ వాణి పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపర్చాలని జేఏసి నాయకులు గురువారం పాఠశాల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఫీజుల రాయితీ అంశాలపై ప్రిన్సిపాల్‌తో చర్చించారు. సింగరేణితో కుదుర్చుకున్న అగ్రిమెంట్‌ను చూపించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రాయితీ ఫీజులను మాత్రమే స్వీకరించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మోల్మామూరిశ్రీనివాస్, వైనాల రాజు, కన్నూరి శ్రీశైలం, ఆసంతిరుపతి, రవికుమార్, బర్లశ్రీనివాస్ తీగల శ్రీధర్, పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు అలవాటు పడొద్దు



మత్తు పదార్థాలకు బానిస కావొద్దని చార్ట్‌ల ద్వారా తెలుపుతున్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మత్తుపదార్థాల జోలికి పోవొద్దని, వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. లక్ష్మీనర్సయ్య అన్నారు. గురువారం కళాశాలలో మత్తు పదార్థాల నిరోధక కమిటీ కోఆర్డినేటర్ బి. మురళి, మెంబర్ డాక్టర్ ఎ. నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఇచ్చే సందేశాలను, నినాదాలను ఆకర్షవంతంగా చార్ట్‌లపై ప్రదర్శించారన్నారు.

ఇందిరమ్మ ఇంటి ఖర్చుల వివరాలు ఇలా..


ఇందిరమ్మ ఇంటినమూనా

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్మించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షలు రూపాయలు ఇస్తోంది. ఐదు లక్షలతో ఇంటి నిర్మాణాన్ని మండల కేంద్రంలో నిర్మించారు. ఇందుకు కావలసిన ముడిసరుకు వివరాలు కూడా బోర్డుపై ప్రదర్శించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, సిమెంట్, ఇసుక, స్టీల్, కంకర, పేయింట్, సిమెంట్ దర్వాజలు, విద్యుత్ కనెక్షన్, ప్లంబర్, మేస్త్రీ, కూలీలు తదితర ఖర్చులు 5 లక్షల రూపా యలతో చేసిన పనులను ప్రదర్శించారు. మండలంలోని అంకంపల్లెలో పైలట్ ప్రాజెక్టుకింద ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నిర్మించే ఇళ్లకు ముగ్గులు పోయడంతో ప్రస్తుతం గ్రామంలో ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. మిగితా గ్రామాల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లు మంజూరువుతాయని అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం నిర్మించి ఇందిరమ్మ ఇంటికి ఖర్చుల విషయంపై ఇంటిగోడకు రాశారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేవారు ఈపట్టికలో ఉన్నట్లు ఇంటికి కావలసిన సామాన్లు తెచుకొని నిర్మిస్తే ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి దశలవారీగా బిల్లులు చెల్లిస్తుందని అధికారులు తెలిపారు.



ఇందిరమ్మ ఇంటికి ఖర్చు వివరాలు

బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సహేందర్‌రెడ్డి

మంథని, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మంథని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ముస్కుల సహేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు గురువారం తెలిపారు. ఎగ్జిక్యూటీవ్ కమిటీ మీటింగ్‌లో సీనియర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా ఎస్. భాస్కర్‌రెడ్డి, లేడీ రిప్రజెంటీవ్ జీ.శ్రీలక్ష్మిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంపత్

ఐఎన్‌టీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా మంథని సంపత్ నియమితులయ్యారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహనీయుల స్ఫూర్తితో ఐక్యపోరాటాలు


విమలరణదీవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

కమాన్‌పూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీఐటీయు జాతీయ నాయకురాలు విమలరణదీవే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సహాయకార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ సీఐటీయు ఏప్రిల్ 6నుండి 14వరకు సామాజిక న్యాయసాధన క్యాంపెయిన్‌లో భాగంగా మహిళల హక్కుల కోసం పోరాడిన విమలరణదీవే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్రంలో నేటికి చాపకింద నీరులాగా కులవివక్ష కొనసాగుతున్నదన్నారు. మతం, కులం ముసుగులో కార్మిక వర్గంలో చీలిక తీసుకురావాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రయత్నాలు చేస్తుందన్నారు. వీటిపట్ల అంగన్వాడీ టీచర్లు, ఆశవర్కర్లు వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కృష్ణకుమారి, జయసుధ, భాగ్య, అంగన్వాడీ యూనియన్ రమ, కృష్ణవేణి, విజయ, ఆశయూనియన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అంతర్గాం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన వంటగ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా మాస్ లైన్ జిల్లా నాయకుడు జూపాక శ్రీనివాస్ అన్నారు. గురువారం అంతర్గాం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలు పెట్టుబడిదారు వర్గాలకు అనుకూలంగా పని చేస్తుందని ఆరోపించారు. జీఎస్టీ పేరుతో నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ బలహీన వర్గాల ప్రజలపై ఆర్థిక భారం మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన వంటగ్యాస్ ధరలు తగ్గించకపోతే ప్రజాపంథా మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. నాయకులు గుమ్మడి వెంకన్న, తిగుట్ల రాములు, పెండ్యాల రమేష్, గొల్లపల్లి చంద్రయ్య, లక్ష్మి, రాజయ్య, శంకర్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలంటూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మల్లు స్వరాజ్యం కాలనీలో మహిళలు ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. పట్టణ కార్యదర్శి మహేశ్వరి, వేల్పుల కుమారస్వామి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అనేకసార్లు పెంచారని, దేశంలో ఇప్పటికే పెరిగిన ధరలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై ఆర్థిక భారం పెంచుతుందని, ప్రతి వస్తువుపై జీఎస్టీలో కలిపిన మోదీ పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లను ఎందుకు జీఎస్టీలో కలుపడం లేదని ప్రశ్నించారు. చమురు కంపెనీల యజమానుల కోసం జీఎస్టీ పరిధిలోకి తీసుకురా వడం లేదని, దేశ సంపదను పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు అప్పగి స్తున్నారని ఆరోపిం చారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిం చారు. మేదరి సారయ్య, రాజమౌళి, సృజన, స్వప్న, సరిత, సులోచన, రజిత, సుగుణ, ప్రమీల, స్వరూప, ఓదెలు పాల్గొన్నారు.


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

కాంట్రాక్టు అధ్యాపకుల అరెస్ట్‌పై నిరసనలు

రామగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురువారం జేఎన్టీయూ మంథని ఇంజనీరింగ్ కళాశాల ఎదుట అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఆందోళన చేపట్టారు. జీవో 21 వ్యతిరేకంగా శాంతియుత నిరసన చేపడుతున్న 12 విశ్వవిద్యాలయాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకించారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌పై పోలీసులు ప్రవర్తించిన తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్‌కు పిలుపుఇచ్చారన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత, సెవెంత్ పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలికి వెళ్ళిన విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం యూనివర్సిటీ పీజీ కళాశాలలో అధ్యాపకులు తరగతులను బహిష్కరించారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని పేర్కొన్నారు. తరగతుల బహిష్కరణకు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మద్దతు తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ యాట ప్రసాద్, డాక్టర్ రవి, డాక్టర్ రమేష్‌రెడ్డి, అజయ్‌కుమార్, యాదవయ్య, శ్యాంప్రసాద్,డాక్టర్ సుధ రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


జేఎన్టీయూ గేట్ ఎదుట నిరసన చేపడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్స్

చదువుకునే దశలోనే జాబ్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకునే దశలోనే జాబ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని శ్రీవాణి విద్యా సంస్థల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక అన్నారు. శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులకు వారం రోజులుగా కొనసాగుతున్న క్యాంపస్ ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కరస్పాండెంట్ మాట్లాడుతు డిగ్రీలు పూర్తయ్యేలోగా జాబ్ సాధించేలా పతిభను చాటుకోవాలన్నారు. పౌండేషన్ ప్రతినిధి పవిత్ర, ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సంతోష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులు ఆపాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆదివాసీలపై జరుపుతున్న దాడులను ఆపాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరించారు. బస్టాండ్ వద్ద గల అమర వీరుల స్థూపం వద్ద ఆదివాసీలపై దాడులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక కన్వీనర్‌లు ముడిమడుగుల మల్లన్న, కె. విశ్వనాథ్, తాళ్లపల్లి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ అటవీ సం పదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ఆదివాసులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు బీజేపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. అందులో భాగంగానే దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగిస్తున్నదని ఆరోపించారు. దీనికోసం ఆదివాసీలకు అన్ని వర్గాల ప్రజలు, దళితులు, మేధావులు, హక్కుల కార్యకర్తలు అండగా ఉండాలని కోరారు. ఈ నెల 20న నిర్వహించే సభకు వక్తలుగా వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు, నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పాల్గొంటారన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మార్వాడి సుదర్శన్ బాలసాని రాజయ్య, బాపన్న , వెక్కురు సదానందం, గుమ్మడి కొమురయ్య, రామిళ్ల బాపు, కొలిపాక రవీందర్, రాజు పాల్గొన్నారు.

ఖనిలో ఉచిత వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు నాగరాజు అన్నారు. గురువారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో విఠల్‌నగర్‌లో ఉచిత గుండె వ్యాధి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతంలో చాలా మంది గుండె వ్యాధి బారిన పడుతున్నారన్నారు. అనంతరం 2డీ ఎకో, మధుమేహ, బీపీ వైద్య పరీక్షలను నిర్వహించారు. గుర్రం కిరణ్, కరుణాకర్, చుక్కల శ్రీనివాస్, బొంగోని హరీష్, యూనిస్ పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయాలి



మాభూమి రథయాత్ర కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్య స్థాపనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి డాక్టర్ విశారదన్ మహారాజ్ ఈనెల 14న ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను జయప్రదం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి మాతంగి రేవంత్, జిల్లా సీనియర్ నాయకుడు సదానందం మహారాజ్ కోరారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంయుక్త కార్యాచరణ సమితి, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మా భూమి రథయాత్ర కరపత్రాన్ని ఆవి ష్కరించారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ లందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు ఆవు నూరి సతీష్, సుద్దాల శంకరయ్య, బచ్చలి రాజయ్య మహారాజ్, కాదాసి రమేష్‌మాతంగి తిరుపతి పాల్గొన్నారు.

తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌కు జరిమానా

కోల్‌సిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నాణ్యతలేని వస్తువులతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న మార్కండేయకాలనీలోని తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులకు నగర పాలక సంస్థ గురువారం ఎనిమిది వేల రూపాయల జరిమానా విధించింది. కమిషనర్ అరుణ శ్రీ ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్‌లతో కూడిన బృందం ఈ తనిఖీలు నిర్వహించి నిర్వాహకుల నుండి జరిమానా వసూలు చేశారు.

ప్రమాదరహిత సింగరేణిగా మార్చాలి



సదస్సులో పాల్గొన్న డీఎంఎస్ నాగేశ్వరరావు, అధికారులు

గోదావరిఖని, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రమాద రహిత సింగరేణిగా మార్చాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీఎంఎస్) ఎన్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆర్జీ-1 ఏరియా కాన్ఫరెన్స్ హాలులో రామగుండం రీజియన్ రక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ నాగేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ బానోతు వెంకన్న, హైదరాబాదు హాజరై మాట్లాడారు. గనులలో రక్షణపై ప్రతీ ఒక్కరిలో అవగాహన ఉండేలా చర్యలను చేపట్టాలన్నారు. గనులపై, పని ప్రదేశాలలో రక్షణ స్లొగన్స్ ఏర్పాటు చేయాలని, భూగర్భ గనులలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ షెల్టర్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూఫ్‌లను కింద పడకుండా జాగ్రత్తగా కాపాడాలని, అలాగే సైంటిఫిక్ స్టడీ చేస్తూ ఎల్లవేళలా పర్యవేక్షించాలన్నారు. సపోర్ట్ ప్లాన్‌ను నిరంతరం పరిశీలిస్తూ, రూఫ్ సపోర్ట్‌ను నిరంతరం ఉన్నతాధికారులు తప్పనిసరిగా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. గనులలో గతంలో జరిగిన ప్రమాదాలపై సమీక్షించి, పునరావృతం కాకుండా తీసుకోవలసిన రక్షణ చర్యలపై సమీక్షించాలన్నారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ-1 జీఎం డీ లలిత్ కుమార్, ఆర్జీ-3 జీఎం ఎన్ సుధాకర్‌రావు, జీఎం ఏపీఏ నాగేశ్వరరావు, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్జీ-2 ఇన్‌చార్జి జీఎం రాముడు, రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం కే.హెచ్.ఎన్. గుప్తా పాల్గొన్నారు. ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, ఏజెంట్లు చిలుక శ్రీనివాస్, రమేష్, అధికారులు సాయి ప్రసాద్, నెహ్రూ, మల్లేశం, రమేష్ కుమార్ పాల్గొన్నారు.



ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ల కోసం పరీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రామగుండం రీజియన్ ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్ కోసం గురువారం పరీక్షలు నిర్వహించారు. ఆర్జీ-3 ఏరియా ఎంవీటీసీలో బీ నుండి ఏ గ్రేడ్ ప్రమోషన్ కోసం నిర్వహించిన పరీక్షలకు 56 మంది ఈపీ ఆపరేటర్లు హాజరయ్యారు. సెలక్షన్ కమిటీ ఆపరేటర్లను పలు అంశాలపై వారికున్న పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. ఓసీపీ-1 ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, ఏరియా ఇంజనీర్ శేఖర్‌బాబు, డీజీఎం ఉదయ్ భాస్కర్, ఆర్జీ-2 పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, ఆర్జీ-1 పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

పాలిసెట్ శిక్షణా తరగతులు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి హైస్కూల్‌లో ఉచిత పాలిసెట్ శిక్షణా తరగతులను ఆర్జీ-2 అఫీషియేటింగ్ జీఎం రాముడు ప్రారంభించారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాలిటెక్నిక్ ద్వారా ఉద్యోగావకాశాలు ఉన్నాయని, పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశాలు పొందేలన్నారు.